క్లుప్తంగా

వనమాతో నామా భేటీ



వనమాతో చర్చిస్తున్న నామా నాగేశ్వరరావు

పాల్వంచ: స్థానిక పాత పాల్వంచలోని మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార సరళిపై చర్చించారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళిక రూపొందించి ఎన్నికల ప్రచారంలో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈనెల 30న సాయంత్రం కొత్తగూడెం జరగనున్న కేసీఆర్ బస్సు యాత్రలో భాగంగా కార్నర్ మీటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు.

రోడ్డుపై బారికేడ్లు తొలగించాలి



డీఎఫ్ఓ దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కొత్వాల, తదితరులు

పాల్వంచ: ఫారెస్ట్ ఆఫీస్ రోడ్‌లో ఇరువైపులా పెట్టిన బారికేడ్లను వెంటనే తొలగించాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఎ.స్వామి, ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డిలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నో సంవత్సరాల నుంచి ప్రజలు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్నారని, ఇప్పుడు మూసేడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నట్లు చెప్పారు. దీంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, బద్ది కిశోర్, శిరసాని రమణ, చాంద్ పాషా, మధు, నజీర్, మస్తాన్, బాబు నాయక్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారుకొండ క్రాస్‌రోడ్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

టేకులపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు టేకులపల్లి మండలం కారుకొండ క్రాస్ రోడ్ వద్ద ప్రత్యేక చెక్ పోస్టుని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం రవాణా చేయడాన్ని నివారించేందుకు చెక్‌పోస్టులో నియమితులైన అధికార సిబ్బంది ప్రతీరోజు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఈ రోడ్డు గుండా వచ్చిపోయే ఆటోలు, కార్లు, టాటామేజిక్‌లు తదితర వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం టేకులపల్లి సర్కిల్ సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐ షేక్ సైదా రవూఫ్, చెక్ పోస్టు సిబ్బంది ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్‌తో పాటు ఎన్నికల నిబంధనలు పాటించాలని లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



కిన్నెరసాని ప్రాజెక్టుపైన పర్యాటకులు



డీర్‌పార్క్‌లో చుక్కల జింకలు



జలాశయంలో స్పీడ్ బోటు

ప్రకృతి అందాలకు నిలయం..

- మినీ ఊటీని తలపిస్తున్న కిన్నెరసాని
- వేసవి సెలవుల్లో పర్యాటకులకు మరింత ఆహ్లాదం
- ఆకట్టుకునే చుక్కల జింకలు,
- జలాశయంలో బోటు షికారు



చిల్డ్రన్ పార్క్‌లో ఆడుకుంటున్న చిన్నారులు

సండే స్పెషల్

పాల్వంచరూరల్: మానవమేధ ఎన్ని ఆవిష్కరణలు చేస్తున్నా అంతుచిక్కని ప్రకృతి ఏదో ఒక మాయ చేస్తూ అబ్బురపరుస్తూనే ఉంటుంది. ఆ మాయ ఇదిగో జీవవైవిధ్యం కలిగిన అటవీ అందాలు, ప్రకృతితో మమేకమై మినీ ఊటిని తలపించే కిన్నెరసాని పర్యాటక కేంద్రలో ఆవిష్కృతం అవుతుంది. కొండ కోనలు, పచ్చని చెట్లు, జలాశయం, వన్యప్రాణులతో చూడచక్కని అందాలకు నిలయం కిన్నెరసాని. ఎత్తైన కొండలు, గుట్టలు, కిన్నెరసాని జలాశయం మధ్య ద్వీపాలు, పచ్చిక బయళ్లు, పంటచేలతో కళకళలాడుతుంది కిన్నెరసాని పర్యాటక ప్రాంతం. ప్రకృతి ప్రేమికుల ఊహకు తగినట్లు ఇక్కడి పరిసరాలు కనువిందు చేస్తాయి. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ నుంచి కూడా పర్యాటకులు ఇక్కడి వచ్చి ఒకటి, రెండు రోజులు ఉండి ప్రకృతిలో బందీ అయిపోతుంటారు. కరిగేకాలంలో చెరిగిపోని మధురస్మృతులకు ప్రతిబింబాలుగా ఈ జ్ఞాపకాలను మదిలో ఉంచుకుంటారు.

అకర్షించే కాటేజీల నిర్మాణం..

పాల్వంచ మండలం కిన్నెరసాని పంచాయతీలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015లో నీతి ఆయోగ్ పథకం కింద రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం, రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేయించారు. అయితే ఆయా నిధులతో కిన్నెరసానిలో తొమ్మిది కాటేజీలు, అద్దాలమేడ, ఫుడ్ కోర్టు పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. కిన్నెరసా ని రిజర్వాయర్‌లో పర్యాటకుల సౌకర్యార్థం బోటు షికారును ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు డీర్ పార్క్‌లోని జింకలు, జలాశయం అందాలను చూసి మైరచిపోతుంటారు. ఒక్కసారి వస్తే మళ్లీ మళ్లీ రావాలనేంతగా ఇక్కడి వాతావరణం ప్రకృతితో మమేకమై ఉంటుంది.

చిల్డ్రన్ పార్క్ ప్రత్యేకం..

ప్రాజెక్టు కింది భాగంలో చిల్డ్రన్ పార్క్ చిన్నారులను, మహిళలను ఆకట్టుకుంటుంది. ఉయ్యాలలు, జారుడు బల్లలతో సమయమే తెలియనంతగా ఉంటుంది. పర్యాటక కేంద్ర భవనంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా వివిధ రకాల జంతువుల బొమ్మలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా జలాశయంలో స్పీడ్ బోటు, రెండు పెద్దబోట్లలో ఎక్కి జలాశయంలో విహారం చేయవచ్చు. కిన్నెరసాని పర్యాటక ప్రాంతమంటే ఒకప్పుడు అద్దాల మేడకు ఎంతో ప్రాముఖ్యత ఉండేది. 1978లో సింగరేణి కాలరీస్ సంస్థ ఆధ్వర్యంలో అద్దాల మేడతోపాటు పలు కాటేజీల నిర్మాణం చేపట్టారు. అయితే కాలక్రమంలో అద్దాల మేడను మావోయిస్టులు ధ్వంసం చేయడంతో కళావిహీనంగా తయారైంది. కాగా కిన్నెరసానిని పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో భాగంగా అద్దాల మేడ పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన రూ.10,77 కోట్ల నిధులతో అద్దాల మేడతోపాటు, కాటేజీలను కూల్చివేసి వాటి స్థానంలో నూతనంగా నిర్మాణం చేశారు. రిజర్వాయర్ చుట్టూ ఎత్తైన గుట్ట మీద రెండు అంతస్తుల తొమ్మిది కాటేజీలు, అద్దాల మేడ, ఫుడ్ కోర్టు నిర్మాణం చేశారు. పర్యాటకుల వాహనాలు కాటేజీలు, అద్దాల మేడ వరకు వెళ్లే విధంగా సీసీ రోడ్డును కూడా నిర్మించారు.

కిన్నెరసానికి ఎలా చేరుకోవాలంటే..

ఖమ్మం నుంచి పాల్వంచకు 90 కిలోమీటర్లు. మహబూబాబాద్ నుంచి 80 కిలోమీటర్ల దూరంలోని పాల్వంచ పట్టణం చేరుకుని, అంబేద్కర్ సెంటర్ వద్ద నుంచి కిన్నెరసాని రోడ్డు మార్గంలో 12 కిలోమీటర్లు వెళ్తే కిన్నెరసాని ప్రాజెక్టు వస్తుంది. అక్కడ ప్రకృతి అందాలతో నిండిన జలాశయం, జింకల పార్క్ ఉంది. కిన్నెరసానికి సమీపంలోని మందేరకలపాడు సమీపంలో



అటవీ ప్రాంతంలో జలపాతం ఉంది. ఇక్కడ నుంచి తిరిగి భద్రాచలం వెళ్లే మార్గం మధ్యలోనే పెద్దమ్మతల్లి ఆలయం ఉంటుంది.

పర్యాటకులకు టికెట్ ధరలు

పెద్దలకు	రూ.30
చిన్నారులకు	రూ.15
టూ, త్రీ వీలర్ వాహనాలకు	రూ.15
నాలుగు చక్రాల వాహనానికి	రూ.50
బస్సుకు	రూ.100
పెద్దబోటు పెద్దలకు	రూ.50
చిన్నారులకు	రూ.30
స్పీడ్ బోటు నలుగురికి	రూ.350

ప్రీ స్కూల్‌లో చిన్నారుల సర్వతోముఖాభివృద్ధి



మాట్లాడుతున్న సీడీపీఓ తార

టేకులపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రీ స్కూల్‌లో చిన్నారులను చేర్పించడం వల్ల వారి సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని, వారికి విద్యతో పాటు పోషకాహారం కూడా లభిస్తుందని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార తెలిపారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి మండలం బర్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ కె.సక్కుబాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీ స్కూల్ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు తరచూ బరువు చూడడం, ఆటపాటలతో అక్షరాలు నేర్పించడం, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం అందించడం జరుగుతుందన్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న తుమ్మలవాగు



వ్యర్థాలతో నిండిన తుమ్మలవాగు

జూలూరుపాడు: కొత్తూరు గ్రామ పంచాయతీ జడలచింత గ్రామ సమీపంలోని తుమ్మలవాగు బ్రిడ్జి వద్ద దుర్గంధం వెదజల్లుతోంది. బ్రిడ్జికి ఇరువైపుల ప్లాస్టిక్, జంతు కళేబరాలు, కోళ్ల వ్యర్థాలను వేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పాపకొల్లు రెవెన్యూ పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగించే ఈ మార్గం మధ్యలో వాగు వద్ద రాగానే ముక్కులు మూసుకొని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం తడి, పొడి చెత్తలను సేకరించేందుకు ట్రాక్టర్లు ఇవ్వడంతోపాటు, డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసింది. వ్యర్థాలు వాగులో ఇష్టానుసారంగా పడేసే వారిని సంబంధిత అధికారులు గుర్తించి చర్యలు తీసుకోకపోవడం, కనీసం బ్లీచింగ్ చల్లించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫంక్షన్ హాళ్ల యాజమానులకు నోటీసులు

పాల్వంచరూరల్: నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేసిన ఫంక్షన్ హాళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీఓ బి.నారాయణ శనివారం తెలిపారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య గల పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఉన్న ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు ఒకరిపై మరొకరు రోడ్డును అక్రమించుకున్నారని అధికారులకు ఫిర్యాదు చేసుకున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 23 మంది ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులకు పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసులు జారీ చేశారు. ఈనెల 29వ తేది సోమవారం ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులతో పెద్దమ్మ గుడి వద్ద సమన్వయ సమావేశం నిర్వహించి పెద్దమ్మ గుడి వద్ద రోడ్డును పరిశీలించనున్నట్లు ఎంపీఓ తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

పాల్వంచరూరల్: భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని తాగివచ్చి నిత్యం వేధిస్తున్నాడని భార్య పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు శనివారం భర్త, మామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధి నాగారం గ్రామానికి చెందిన మెడికల్ ప్రాక్టీషనర్ కె.అనిల్‌కుమార్‌తో సోములగూడేనికి చెందిన అనితతో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు సంతానం. కొంతకాలంగా భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడు అని ఈనెల 13న ఇద్దరి మధ్య గొడవ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త, మామ లక్ష్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

ఎట్టకేలకు రహదారికి మోక్షం..

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండలంలోని తడికలపూడి నుంచి కారేపల్లి మండలం చీమలపాడు రోడ్డు ప్రయాణం ఇక సులువు కానుంది. ఏడు కిలోమీటర్ల ఈ మార్గం గుంతలు, కంకర తేలి ప్రమాదకరంగా ఉంది.

దీనిపై ఈనెల 14న సాక్షిలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. హుటాహుటిన రోడ్డు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపుల చెత్త, పిచ్చి మొక్కలు తొలగిస్తున్నారు. శనివారం ఆర్అండ్‌బీ ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. సోమవారం నుంచి పాత రోడ్డును తొలగించే పనులు చేపడతామని, బీటీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు.

పగటిపూట బయటికి రావొద్దు..



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లోహిత

ఇల్లెందురూరల్: ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న కారణంగా అత్యవసరమైతేనే తప్ప పగటపూట ప్రజలెవరూ బయటకు రావొద్దని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత సూచించారు. ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ నెహ్రూనగర్ గ్రామంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతీ ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. డాక్టర్ లోహిత మాట్లాడుతూ.. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి వంటివి వడదెబ్బ లక్షణాలని వివరించారు. ఈ సమయంలో ప్రజలు నీరు, పళ్లరసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని, కాటన్ దుస్తులు ధరించాలని, భోజనం మితంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రచార వాహనాలు ప్రారంభం



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న నాయకులు

జూలూరుపాడు: కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ప్రచార వాహనాలను జూలూరుపాడులో శనివారం వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు పార్టీ జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచార రథాలతో మండల వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఓటర్లు హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి సుమంత్, వేల్పుల నరసింహారావు, లకావత్ లచ్చు నాయక్, పోతురాజు నాగరాజు, శీరంశెట్టి నరసింహారావు, మిర్యాల కిరణ్ కుమార్, చందా, బానోత్ వెంకట రాజు, పత్తిపాటి మోహన్, మల్కం వీరభద్రం, మందా సురేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి కాంగ్రెస్ ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న బలరాం నాయక్

ఇల్లెందు: కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం చేపట్టేందుకు ముఖ్య నేతలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని నంబర్-2 బస్తీ బజన్ మందిర్ నుంచి ప్రచారం ప్రారంభించాలని నిర్ణయించారు. పట్టణంలోని ముఖ్య నేతలతో చర్చించి తొమ్మిది మందికి పట్టణ ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 28 నుంచి మే 4 వరకు 24 వార్డుల్లో ప్రచారం నిర్వహించాలని, ప్రతీరోజు సాయంత్రం 5 గంటలకు ప్రచారం ప్రారంభించాలని నిర్ణయించారు. 28న భజనమందిర్ ఏరియాలో 4 నుంచి 7 వార్డులలో, 29న 8వ వార్డు గణేష్ మండపం నుంచి 9, 10 వార్డులలో ప్రచారం చేయనున్నారు. 30న సీఈఆర్ క్లబ్ సర్కిల్‌లో 11 నుంచి 14 వార్డులలో, మే 2న జగదాంబా సెంటర్ నుంచి 15 నుంచి 18వ వార్డులలో, 3వ తేదీన స్టేషన్ బస్తీ గాంధీ సెంటర్ నుంచి 19 నుంచి 21 వార్డులలో, 4వ తేదీన 24 ఏరియా నుంచి 22 నుంచి 24 వార్డులలో ప్రచారం నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ప్రచార బాధ్యతలను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు డానియేల్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మడుగు సాంబమూర్తి, ఎండీ జాఫర్, యదళ్లపల్లి అనసూర్య, బోళ్ల సూర్యం, చల్లా శ్రీనివాసరావు, ఎస్‌కే జానీ, అంకెపాక నవీన్‌లను నియమించారు. ఇదిలా ఉండగా శనివారం ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ పట్టణంలోని 2వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన తన క్యాంపు కార్యాలయంలో ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రచార షెడ్యూల్ రూపొందించారు.

గ్రామగ్రామాన మేడే వేడుకలు నిర్వహించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పాల్వంచ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫాసిస్ట్ విధానాలను ఎండగడుతూ ప్రచారం చేయాలని, మేడే వేడుకలను గ్రామగ్రామాన నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. శనివారం పాల్వంచలో భద్రాచలం డివిజన్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... దేశంలో మోదీ ప్రభుత్వం కార్మికవర్గంపై తీవ్రమైన దాడి కొనసాగిస్తోందన్నారు. కార్మికవర్గం అనేక పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వం అనేక సంస్థలను ప్రైవేట్ పరం చేశారన్నారు. పదేళ్ల కాలంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందన్నారు. ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. కుంజ కృష్ణ, ముసలి సతీశ్, ఆదినారాయణ, వీరమల్ల ఉమ, కొండపునేని సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోటేశ్వరికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న చీమల కోటేశ్వరి

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ వేములవాడ గ్రామానికి చెందిన చీమల కోటేశ్వరికి యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. సుదీర్ఘకాలంగా ఆమె చేసిన సామాజిక కార్యక్రమాలు, కరోనా సమయంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను గౌరవించి తమిళనాడులో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టరేట్ అందజేశారు. వేములవాడ గ్రామానికి చెందిన నంగయ్య తన తండ్రి నుంచి సింగరేణి ఉద్యోగాన్ని వారసత్వగా పొంది చాలాకాలం క్రితం భార్య కోటేశ్వరితో కలసి గోదావరిఖనిలో స్థిరపడ్డాడు. ప్రస్తుతం సింగరేణిలో ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇదిలా ఉండగా కోటేశ్వరి చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఆమెకు డాక్టరేట్ రావడం పట్ల స్వగ్రామమైన వేములవాడలో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కూనంనేని

సుజాతనగర్: కార్పొరేట్ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి, దేశ సంపదకు రక్షణ ఏర్పడుతుందని, ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని నాయకులగూడెం, మంగ్రితండా, సుజాతనగర్ తదితర గ్రామాల నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో పలు కుటుంబాలు శనివారం సీపీఐలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ... కార్పొరేట్ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి, దేశ సంపదకు రక్షణ ఏర్పడుతుందని, ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందన్నారు. పదేళ్ల మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. మళ్లీ బీజేపీ గద్దెనెక్కితే దేశం అధోగతి పాలవుతుందని, విచ్చలవిడిగా ప్రజా, కార్మిక, రైతు, ఉద్యోగ చట్టాలని తీసుకొచ్చి బతుకు లేకుండా చేస్తారని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను ఆయుధంగా చేసుకుని బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీపై నమ్మకంతో కొత్తగూడెం నియోజకవర్గ స్థానంలో గెలిపించి చట్టసభకు పంపారని వారి నమ్మకానికి అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తీర్చేందుకు ఎల్లవేళలా సీపీఐ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. సీపీఐలో చేరినవారిలో తాజా మాజీ సర్పంచ్ మండె నాగరాజేశ్వరీ, మండే నాగేశ్వరరావు, వీరరావు, బాలు లక్ష్మీనారాయణ, మూడు శ్రీను, శంకర్, గుగులోత్ శ్రీను, భూక్యా వినోద్ కుమార్, మూడు హస్లీ, భూక్యా చిట్టెమ్మ, బొడ్డు నాగమణి, కళావతి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, భూక్యా దస్రు, కుమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఎంపీపీ భూక్యా పద్మావతి త్ళ్ల వెంకటేశ్వరరావు, మంగ్యా, పొదిల శ్రీనివాస్, వేల్పుల భాస్కర్, వీర్ల మల్లేష్, దండు నాగేశ్వరరావు, తాళ్లూరి పాపారావు, ధర్మారావు, బొడ్డు కేశవరావు, కొమారి కృష్ణ,గణేష్ పాల్గొన్నారు.

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



జూలూరుపాడు: మాట్లాడుతున్న ఉమర్



ఇల్లెందురూరల్: కూలీలతో మాట్లాడుతున్న సారంగపాణి

జూలూరుపాడు: ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర నాయకుడు ఎస్కే ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏఐకేఎంఎస్ నాయకుల బృందం గుండెపుడి, రామచంద్రాపురం, వెంగన్నపాలెం, జూలూరుపాడు గ్రామాల్లోని ఉపాధి ఆవాస ప్రాంతాలను సందర్శించి, ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... ఉపాధి కూలీల దినసరి వేతనం రూ.300 ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఉపాధి పనులు చేసే ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. నీడ కోసం టెంట్లు, తాగునీరు, మజ్జిగతోపాటు పలుగు, పార అందజేయాలన్నారు. పెండింగ్ ఉపాధి బిల్లులు కూలీల బ్యాంకు ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వల్లోజి రమేష్, బత్తుల గోపి, కూరాకుల నరసింహారావు, ఇల్లంగి గోపయ్య, నరసింహారావు, ఎస్కే జానివిఁయా, కృష్ణ, రామారావు, లక్ష్మి, రమణ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు ఏటా 200 రోజులు పని కల్పించాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని పోలారం, బోయితండా గ్రామపంచాయతీలలో శనివారం ఉపాధి కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొలతలతో సంబంధం లేకుండా కూలీలకు రోజుకు రూ.750 చెల్లించాలని, పని ప్రదేశంలో నీడ, నీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని, పనికి అవసరమైన సామగ్రిని ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వచ్చే పార్లమెంట్ ఎన్నికలో బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్‌కు న్యూడెమోక్రసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మోకాళ్ల మురళీకృష్ణకు ఓటు వేయాలని కోరారు. బానోత్ సంతు, వాంకుడోత్ సరోజిని, మోతీలాల్, జటంగి వెంకన్న, మూడు మాలు, భావ్‌సింగ్, వెంకన్న పాల్గొన్నారు.